కాలువలపైనే నిర్మాణాలు

- లక్ష్మీప్రియనగర్‌కాలనీలో అడ్డగోలు పనులు
- పట్టించుకోని అధికారులు
- తూతూమంత్రంగా ఆక్రమణల తొలగింపు

హయత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని లక్ష్మీప్రియనగర్‌కాలనీ కాలువల కబ్జాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కాలనీ గుండా బాతులచెరువు, కుమ్మరి కుంట చెరువులకు ఉన్న రాచకాలువ, జాల కాలువలు ఆక్రమణలతో కనుమరుగు అవుతున్నాయి. అడ్డగోలుగా కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. పది సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుండగా స్థానిక ప్రజలు, సమాజహితులు ఇరిగేషన్, లేక్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయి ఫిర్యాదు చేయడమే మానేశారు. దీంతో కాలువల పైన అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు అయ్యాయి. ఇప్పుడు వాటిని తొలగించడం అధికారులకు తలనొప్పిగా మారింది.


కూల్చివేసిన ఇంటి వద్ద అధికారులు


జాల కాలువ పైనే నిర్మించిన మరో ఇల్లు


జాల కాలువపైన నిర్మించిన ఇంటిని తొలగించిన అధికారులు

కాలువల ఆక్రమణలతో నిండని జంట చెరువులు

రాచకాలువ, జాలకాలువ ఆక్రమణలతో వర్షం నీరు చెరువుల్లోకి రాకపోవడంతో హయత్‌నగర్‌లోని జంటచెరువులు నీరు లేక వెలవెల బోతున్నాయి. కుమ్మరికుంట కొంత మేరకు నీరు ఉన్నా బాతులచెరువు మాత్రం నేటికి నిండలేదు.

నామ మాత్రంగా ఆక్రమణల తొలగింపు

లక్ష్మీప్రియనగర్ కాలనీలో రైస్‌మిల్ పక్కన రాచ కాలువపైన నిర్మిస్తున్న రేకుల ఇంటిని బుధవారం జీహెచ్‌ఎంసీ నార్త్ ట్యాంకు అధికారులు, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు కలిసి తొలగించారు. దాదాపు 6 మీటర్ల విస్తరణలో ఉన్న కాలువను కేవలం సుమారు రెండు మీటర్ల వరకు మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారు. అధికారులు కూల్చివేసిన ఇంటికి అటు- ఇటుగా ఆక్రమణలు కనిపిస్తున్నా వాటి జోలికి వెళ్లకుండా తూతూ మంత్రంగా పని కానిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ నార్త్ ట్యాంకు డివిజన్ ఏఈ సతీష్, హయత్‌నగర్ మండల ఆర్‌ఐ నర్సింహతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే చేసి అన్ని ఆక్రమణలు తొలగిస్తాం..

రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని రాచకాలువ, జాల కాలువలను సర్వే చేయిస్తాం. సర్వేలో కాలువ అసలు స్వరూపం తెలుసుకుని ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తాం. ఆక్రమణల విషయాన్ని హైడ్రా అధికారులకు నివేదిస్తాం.

- సతీష్, ఏఈ,
నార్త్ ట్యాంకు డివిజన్, జీహెచ్‌ఎంసీ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారం

- హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్

సరూర్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎ.మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిబట్ల మునిసిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

టీపీసీసీ సమావేశానికి హాజరైన కార్పొరేటర్

చంపాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర అభివృద్ధిపై బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశానికి హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ హాజరయ్యారు. జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లతో టీపీసీసీ అధ్యక్షుడు పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు సుజాతానాయక్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.


టీపీసీసీ సమావేశంలో కార్పొరేటర్ సుజాతానాయక్

మధుయాష్కీని కలిసిన నేతలు


మధుయాష్కీగౌడ్‌ని కలిసిన ఆనంద్‌కుమార్, బేర బాలకిషన్ తదితరులు

ఎల్‌బీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, సరూర్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయం ట్రస్టీ బేర బాలకిషన్‌లు బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్క అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాగ్‌మార్ సత్యనారాయణగౌడ్, మునగాల బుచ్చినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక వర్గానికి అనుకూలంగా సర్కార్ పనితీరు : అందెల

సరూర్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక వర్గానికి అనుకూలంగా ఉంటూ హిందూ వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసానికి నిరసనగా ఎక్కడికక్కడ అమ్మవారి ఆలయాల్లో శాంతి హారతులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ క్రమంలో బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని సాయిరామ్‌నగర్ ఫేజ్-1 కాలనీలో నిర్వహించిన శాంతిహారతి, ముత్యాలమ్మ అమ్మవారి శావా ఊరేగింపు కార్యక్రమంలో అందెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల్లో ఐక్యత లేకపోవడం వల్లనే రాష్ట్రంలో తరచుగా ఇలాంటి దుస్సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం ఒత్తిడికి తలొగ్గి పని చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఆలయాలపై జరుగుతున్న దాడులను అధికార పార్టీ నాయకులు ఖండించకపోవడం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని శ్రీరాములుయాదవ్ అన్నారు. ముత్యాలమ్మకు శాంతి జరిగేలా వచ్చే శుక్రవారం (18వ తేదీన) అన్ని ఆలయాల్లో మహాశాంతి హారతులు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, పూజారి నర్సింహ, కాలనీ ప్రతినిధులు రాకేశ్, అనీల్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.


ముత్యాలమ్మ శావా ఊరేగింపులో శ్రీరాములుయాదవ్

పారిశుధ్య కార్మికులకు సహకారం అందించాలి

మన్సూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్తు సమయంలోనైనా నిత్యం మన కాలనీలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు ముందుంటారని, ప్రతి ఒక్కరూ తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. దసరా పర్వదినం రోజు సైతం విధులు చేపట్టిన పారిశుధ్య కార్మికులకు డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో బుధవారం ఆయన దసరా కానుకలను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జవాన్ శ్రీనివాస్, సూపర్‌వైజర్స్, కాలనీవాసులు కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కృష్ణయ్య, రామస్వామి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

దొంగ అరెస్టు

- 35 కిలోల విద్యుత్ వైర్లు, రూ.25వేల నగదు స్వాధీనం

మన్సూరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 35 కిలోల విద్యుత్ వైర్ బెండల్‌తో పాటు రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని బ్లైండ్స్‌కాలనీలో మహమ్మద్ రియాజుద్దీన్ అన్సారీ తన స్థలంలో నిర్మాణాలు చేపట్టాడు. ఆ స్థలంలో ఉంచిన 15 విద్యుత్ వైర్ల కట్టలు కనబడకపోవడంతో ఇదివరకు తన వద్ద పని చేసిన అంబర్‌పేటలోని పటేల్‌నగర్‌లో నివాసం ఉండే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సుమిత్ టండన్‌ను అనుమానిస్తూ బాధితుడు నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా బుధవారం పటేల్‌నగర్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా దొంగతనం చేసినట్లు సుమిత్ టండన్ ఒప్పుకోవడంతో అతడిని అరెస్టు చేసి 35కిలోల విద్యుత్ వైర్ల బెండల్, రూ.25వేల నగదును స్వాధీనపర్చుకున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

- బడంగ్‌పేట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి హెచ్చరిక

సరూర్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, అలాంటి వారిలో మార్పు వచ్చేలా భారీగా జరిమానా విధించనున్నట్టు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి స్పష్టం చేశారు. బుధవారం 31వ డివిజన్‌లోని రోడ్డు పక్కన చెత్త పడేస్తున్న పలువురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారికి రూ.5వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ బడంగ్‌పేట్‌ను స్వచ్ఛ కార్పొరేషన్‌గా మార్చడానికి పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, ఈ దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే జరిమానా తప్పదని పేర్కొన్నారు. ఇళ్ల ముందుకు, షాపుల ముందుకు వచ్చే చెత్త ఆటోలు, రిక్షాల్లోనే చెత్తను వేయాలని, అలా కాకుండా ఎక్కడబడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.


బహిరంగ ప్రదేశంలో చెత్త వేసిన వ్యక్తికి జరిమానా విధిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

ఇళ్ల వ్యర్థాలను చెత్త సేకరించే వాహనాల్లోనే వేయాలి

కొత్తపేట : ఇళ్లలో పేరుకుపోయే వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని చెత్త సేకరించే వాహనాల్లోనే వేయాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి మారుతీనగర్, ప్రభాత్‌నగర్ కాలనీల ప్రధాన రహదారిలో పర్యటించారు. ప్రధానంగా ఫ్రూట్ మార్కెట్ ప్రహరీ పక్కన ఉన్న గార్బేజీ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ) ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులతో పాటు పరిసర కాలనీల వారూ వ్యర్థాలను చేరవేస్తుండడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని గుర్తించారు. ఈ జీవీపీని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పారిశుధ్య విభాగం డీఈఈ చందనను కోరారు. అధికారులు బాబ్‌క్యాట్‌ను తెప్పించి, జీవీపీ వద్ద చెత్తను, వ్యర్థాలనూ తొలగించడంతో పాటు, మట్టిని తొలగించి చదును చేయించారు. ప్రజలు అక్కడ చెత్త వేయకుండా ఉండేలా అవగాహన కల్పించాలని కార్పొరేటర్ కోరారు. వ్యర్థాలను చేరవేసే వాళ్లను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మారుతీనగర్‌కాలనీ అధ్యక్షులు కుంచల మల్లేషం, పారిశుధ్య విభాగం డీఈఈ చందన, సిబ్బంది బుచ్చయ్య, ప్రేమ్, విజయభారతి పాల్గొన్నారు.


శానిటేషన్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ట్రేడ్ లైసెన్సులను తనిఖీ చేసిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'పెద్ద అంబర్‌పేట్‌లో ట్యాక్స్ ఫ్రీ వ్యాపారం' శీర్షికతో ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనంతో మున్సిపాలిటీ అధికారులు రంగంలోకి దిగారు. ట్రేడ్ లైసెన్సు లేని వ్యాపారాలను గుర్తించేందుకు మున్సిపల్ కమిషనర్ మంగళవారం వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో కలిసి రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే బుధవారం రెండు టీంలు మున్సిపాలిటీ పరిధిలోని పలు వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్సులను తనిఖీ చేశారు. లైసెన్స్ ఉన్న వాటితో పాటు లేని వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. లైసెన్సు తీసుకోకుండా వ్యాపారం నిర్వహిస్తున్న యజమానులకు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


పెద్దఅంబర్‌పేట్‌లో ట్రేడ్ లైసెన్సులను తనిఖీ చేస్తున్న వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

హయత్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ 15 వార్డు కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మునగనూరుకు చెందిన కె. శ్రీనివాస్‌కు రూ. 60 వేలు, సీహెచ్. ఉమాదేవికి రూ. 60వేలు, ఏ. జాన్సీరాణికి రూ. 60వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుత్తా వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, టింకురెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న కౌన్సిలర్ స్వాతిఅమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి

ఆర్టీసీ డ్రైవర్‌పై అగంతకుల దాడి

- పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

హయత్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు హయత్‌నగర్ -1 డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై మంగళవారం రాత్రి దాడి చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్-1 డిపోకు చెందిన 290 బస్సు మంగళవారం రాత్రి 11.30 సమయంలో కుంట్లూర్‌కు వెళ్తోంది. హయత్‌నగర్‌లో కుంట్లూర్ రోడ్డులో బస్సును మలుపుతుండగా ముందర కారు ఉంది. వెంటనే డ్రైవర్ శ్రీనివాస్ హారన్ మ్రోగించాడు. దీంతో కారు పక్కకు వెళ్లింది. బస్సు కుంట్లూరుకు చేరుకుంది. ప్రయాణికులందరు దిగి పోగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడిచేశారు. దాడిని సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తున్న కండక్టర్ వెంకటయ్యపైన కూడా దాడికి దిగారు. తీవ్ర గాయాలకు గురైన డ్రైవర్‌ను తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

చాదర్‌ఘాట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తుందని పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పీడీఎస్‌యూ గ్రేటర్ కార్యవర్గం ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై పలు కళాశాలల విద్యార్థులతో కలిసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని, దీని కారణంగా నిరుపేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలవుతున్నా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను చెల్లించకుండా మాజీ సీఎం కేసీఆర్‌కు తానేమి తక్కువ కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఏ ప్రభుత్వమైనా గద్దె దిగకతప్పదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్యామ్, పూజా, రమేష్, సురేష్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థులతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కాంగ్రెస్ సేవాదళ్ ఎల్బీనగర్ అధ్యక్షుడిగా ప్రశాంత్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సేవాదళ్ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా లింగోజీగూడకు చెందిన కుకుడాల ప్రశాంత్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేసి ఆ పత్రాన్ని బుధవారం ప్రశాంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సేవాదళ్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన మిద్దెల జితేందర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పోగాకు రమాకాంత్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న ప్రశాంత్‌రెడ్డి

విశ్వకర్మల అవార్డుల కోసం ఆహ్వానం : పుష్పగిరి

వనస్థలిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక, రాజకీయ, విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు అందించిన విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ కులస్థుల సేవలను గుర్తిస్తు నవంబరు 12న ఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో విశ్వకర్మ అవార్డులను అందజేస్తున్నట్లు విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వనస్థలిపురంలో మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ వేదవేదాంగ వేత్తలు, శాస్త్రకారులు, ఆగమ పండితులు, వృత్తిలో అమోఘ ప్రతిభను కనబర్చిన పంచశీలులతో పాటు పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారిని తమ సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో నవంబరు 12న అవార్డులతో సత్కరిస్తున్నట్టు తెలిపారు. అవార్డులకు అర్హులైన వారు ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలతో పాటు తమ పూర్తి బయోడెటాను అక్టోబరు 20లోపు 9666435426 నంబర్‌కు వాట్సాప్ చేయాలని ఆయన కోరారు.


విశ్వనాథుల పుష్పగిరి

మరణించిన ఏఎస్ఐ కుటుంబానికి చెక్కులందజేసిన సీపీ


ఏఎస్ఐ రమణారెడ్డి కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేస్తున్న కమిషనర్ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ : రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ కంట్రోల్ రూంలో ఏఎస్ఐగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన కె.వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులకు సీపీ సుధీర్‌బాబు బుధవారం కమిషనరేట్‌లో రూ.7.45లక్షల చెక్కును అందించారు. రమణారెడ్డి భార్య విజితకు ఐదు లక్షల ఎనభై వేల నలభై రూపాయలు, కుమార్తె అనన్యకు రెండు లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వారి కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి సంక్షేమం తమ బాధ్యత అని, ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డితోపాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


కంద్పన్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రింకీ కంద్పన్ (24) భర్త అశ్వీన్ కంద్పన్ బతుకుదెరువు కోసం వలస వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో నివాసం ఉంటున్నా రు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా మంగళవారం ఉదయం 8గంటలకు కూలీ పని కి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అశ్వీన్ బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరులో ఎస్‌కేఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్ స్పోర్ట్స్ లీగ్ సీజన్-4

చాదర్‌ఘాట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డిసెంబరులో జరగనున్న ఎస్‌కేఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్ స్పోర్ట్స్ లీగ్ సీజన్-4 నాగోల్‌లోని సీఎస్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు శ్రీకృపా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ లీగ్ కరపత్రం, బ్యానర్‌ను బుధవారం మలక్‌పేటలో ఆవిష్కరించారు. శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ రిటైల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ స్పోర్ట్స్ లీగ్ డిసెంబరులో నాలుగు ఆదివారాల్లో మాత్రమే జరగనున్నాయి. కార్యక్రమంలో హైదరాబాద్ కిరాణ అసోసియేషన్ కార్యదర్శి మనీష్ బాటీ, హైదరాబాద్ దాల్ మర్చంట్ అసోసియేషన్ సెక్రెటరీ అనిల్ కాబ్రా, శ్రీకృపా మార్కెట్ అసోసియేషన్ కార్యదర్శి దీపక్ మోదీ, సలహాదారులు మహేందర్ జైన్, అశోక్‌గుప్తా, సభ్యులు సురేష్, పవన్, మహేష్, వికాస్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


స్పోర్ట్స్ లీగ్ కరపత్రం, బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్ తదితరులు

ఆర్థిక సమస్యలతో రియల్టర్ ఆత్మహత్య

కొత్తపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఆర్థిక సమస్యలతో రియల్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ హెచ్ ఓ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సామ రోహిత్‌కుమార్(36) సామ ప్రియాంక దంపతులు శ్రీశంకర్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. ప్రియాంక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రోహిత్‌కుమార్ రియల్టర్. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఉన్నాయని అతడు తరచూ ఆందోళన వ్యక్తం చేసేవాడు. దసరా పండుగకు సూర్యోదయ కాలనీలో ఉండే తల్లి ఇంటికి వెళ్లారు. కొన్నాళ్లు అక్కడే ఉండి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం 11గంటలకు బ్యాంకుకు వెళ్తున్నానని రోహిత్‌కుమార్ బయటకు వెళ్లాడు. అతడి భార్య కూడా బయటకు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి చేరుకుని ఇంటి తాళం తీసి లోపలికి వెళ్లి చూసేసరికి బెడ్ షీట్‌తో రోహిత్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. బుధవారం ఉదయం ఆర్థిక సమస్యలతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.